TGTEL / 25 / A3750

# ..నిజమే.. నిజాయితి

ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య సంపుటి 1 సంచిక 01 ప్రింటర్ : గుండూర్ శ్యామ్ . శనివారం 15 నవంబర్ 2025 వెల 4:00

"నిజాయితి" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.



## జూబ్లిహిల్స్ గెలుపుతో పెరిగిన రేవంత్ పలుకుబడి



**నిజాయితి, హైదరాబాద్ :**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించాడు. ఊహించని విధంగా 25 వేల భారీ మెజారిటీతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో నవీన్ యాదవ్ విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణులు పట్టరాని సంతోషంలో మునిగిపోయాయి. అయితే జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక కాంగ్రెస్ పార్టీకి మాత్రమే కాదు, సీఎం రేవంత్ రెడ్డి కి మంచి బూస్ట్ ఇచ్చింది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి ఇమేజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది.

జూబ్లీ హిల్స్ లో గట్టిగా ప్రచారం చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ లోని అన్ని డివిజన్లలో విస్తృతంగా ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి డివిజన్ల స్థాయిలో ప్రచారం చేసి కాంగ్రెస్



విజయానికి దోహదం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇది రేవంత్ సాధించిన రెండవ విజయం. గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు.

జూబ్లీ హిల్స్ గెలుపుతో బాగా పెరిగిన రేవంత్ ఇమేజ్ కంటోన్మెంట్లో 13 వేల ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ గణేష్ విజయాన్ని సాధించారు. అప్పుడు కూడా కంటోన్మెంట్లో కాంగ్రెస్ విజయం కోసం రేవంత్ రెడ్డి కీలకంగా పనిచేశారు. మళ్లీ ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేవంత్ రెడ్డి అక్కడ పార్టీకి పట్టం కట్టి విజయకేతనం ఎగురవేశారు దీంతో ప్రస్తుతం జూబ్లీహిల్స్ గెలుపుతో రేవంత్ రెడ్డికి ఇమేజ్ బాగా పెరిగింది. కంటోన్మెంట్, జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ సత్తా కంటోన్మెంట్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో అక్కడ ఉప ఎన్నిక జరిగింది. అక్కడ బి ఆర్ ఎస్ ఓడిపోయింది. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందడంతో, ఇక్కడ కూడా ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికలోనూ బీఆర్ఎస్ ఓటమిపాలైంది. కాంగ్రెస్ తన సత్తాను మరోమారు చాటింది.

భవిష్యత్ ఎన్నికలకు మార్గం సుగమం చేసిన రేవంత్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో వచ్చిన ఉప ఎన్నికలలో వరుసగా రెండవసా విజయం సాధించడం ఇప్పుడు అందరిలోనూ చర్చనీయాంశంగా మారింది. బిఆర్ ఎస్ సిట్టింగ్ సీట్లను భారీ విజయంతో గెలిపించిన రేవంత్ రెడ్డి అటు కాంగ్రెస్ అధిష్టానం వద్ద కూడా తన పట్టును చాటుకున్నాడు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో కలిసి తిరుగులేని వ్యూహాలు రచించిన రేవంత్ రెడ్డి తన ఇమేజ్ ను పెంచుకోవడంతో పాటు, ఈ ఎన్నికల ఫలితాలతో భవిష్యత్తు ఎన్నికలకు మార్గం సుగమం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ సత్తా చాటుతుందని, ఈ ఎన్నికలతో చెప్పకనే చెప్పారు.

## బీఆర్ఎస్ ఓటమిని సెలబ్రేట్ చేసుకున్న కవిత



**నిజాయితి, హైదరాబాద్ :**
జాగృతి అధ్యక్షురాలు కవిత ఆసక్తికర ట్వీట్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితంపై ఆమె ట్వీట్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడంపై ఆమె సెటైరికల్‌గా స్పందించారు. 'ఖర్మ హిట్స్ బ్యాక్' అంటూ తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. పరోక్షంగా బీఆర్ఎస్ ఓటమిని ఆమె ఈ విధంగా సెలబ్రేట్ చేసుకున్నారు. లిక్కర్ స్కాంలో జైలుకు వెళ్లొచ్చిన తర్వాత కవిత, బీఆర్ఎస్ అధినాయకత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం మొదలుపెట్టారు. దీంతో ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో కవిత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. అయితే కవిత రాజీనామాను స్పీకర్ ఇంకా ఆమోదించలేదు. ప్రస్తుతం కవిత జాగృతి పేరిట ప్రజా పోరాటాలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఫలితంపై తనదైనశైలిలో రియాక్ట్ అయ్యారు కవిత.

ఇక జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం కారణంగా అనివార్యమైన ఈ ఉప ఎన్నిక, కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీల మధ్య నువ్వా నేనా అన్నట్టుగా హోరాహోరీ పోరాటంగా మారింది. గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, పట్టువదలని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఈసారి విజయాన్ని అందుకున్నారు. రాష్ట్రంలో అధికార పార్టీగా ఉండటం, ప్రభుత్వ యంత్రాంగం , నాయకుల కృషి ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

ఓట్ల సమీకరణలో కీలకపాత్ర పోషించిన ఎంఐఎం పార్టీ బహిరంగ మద్దతు కాంగ్రెస్ గెలుపును సులభతరం చేసింది. ముస్లిం ఓటర్లు గణనీయంగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఈ మద్దతు కాంగ్రెస్ మెజార్టీని పెంచింది. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడానికి బీఆర్ఎస్ పార్టీ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీతకు టికెట్ ఇచ్చింది. సానుభూతిపై బీఆర్ఎస్ ఆశలు పెట్టుకున్నప్పటికీ, కాంగ్రెస్ అనుకూల పవనాల ముందు బీఆర్ఎస్ ఓటమిని చవిచూడక తప్పలేదు. జూబ్లీహిల్స్ విజయం అధికార పార్టీకి మరింత బలాన్ని చేకూర్చగా, బీఆర్ఎస్‌కు ఇది కోలుకోలేని దెబ్బ అని చెప్పవచ్చు. నవీన్ యాదవ్ సుమారు 24,000 ఓట్లకు పైగా భారీ మెజార్టీతో విజయం సాధించారు.

## జూబ్లీహిల్స్ షాక్: కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు!

**నిజాయితి, హైదరాబాద్ :**
జూబ్లీహిల్స్ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఈ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ దాదాపు 25 వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈ ఓటమిని కేటీఆర్ చిన్న సెట్ బ్యాక్‌గా అభివర్ణించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని కేటీఆర్ స్పష్టం చేశారు. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతూ ఆయన ఈ విధంగా అన్నారు. "రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ముందుకు పోదాం, కార్యకర్తలు సన్నద్ధం కావాలి. మరింత బలంగా పనిచేద్దాం. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే వరకూ శ్రమిద్దాం." అంటూ కేటీఆర్ పేర్కొన్నారు.

ఈ ఉప ఎన్నిక బీఆర్ఎస్ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చిందని, రాష్ట్రంలో బీఆర్ఎస్ మాత్రమే రాజకీయ ప్రత్యామ్నాయం అని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ఆయన అన్నారు. ఇకపైనా ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అద్భుతంగా పనిచేశాయని కేటీఆర్ అభినందించారు. వ్యక్తిగతం సమస్యలు ఉన్నా బీఆర్ఎస్ నాయకులు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయం కోసం నిర్విరామంగా పనిచేశారని.. వారికి



పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. ప్రతి బూత్‌లో స్థానిక నాయకత్వం బాగా పనిచేసిందని.. మాగంటి సునీతకు రాజకీయ అనుభవం లేకపోయినా ఆమె ఎంతో కష్టపడ్డారన్నారు. ఓ రకంగా పోరాటమే చేశారన్నారు.

"గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ అద్భుతమైన పాత్ర పోషిస్తోంది. ప్రజా సమస్యలు కేంద్రంగా కొట్లాడుతున్నాం. ఈ ఎన్నికల్లో మాకు ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు." అంటూ కేటీఆర్ అన్నారు. ఎన్నికల తీరుపై కేటీఆర్ పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఈ ఉప ఎన్నికలో నిజాయతీగా కొట్లాడామని.. ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసన్నారు. వాటి గురించి తాను మాట్లాడనని.. ప్రచారం ముగిసే వరకూ ఒకరకంగా.. ముగిశాక మరో రకంగా జరిగాయంటూ అధికార పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చరిత్రను గుర్తు చేస్తూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. "2014-23 మధ్య ఏడు ఉప ఎన్నికలు జరిగాయి. అప్పటి ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికలోనూ గెలవలేదు. మేము ఐదు గెలిచాం. జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తే కూడా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒకట్రెండు కార్పొరేట్ సీట్లు మాత్రమే వచ్చాయి. పదేళ్లు ప్రభుత్వం నడిపిన ఓ జవాబుదారీ పార్టీగా జూబ్లీహిల్స్‌కు ఏం చేశారంటే.. మేము రూ. 5 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశాం." అని కేటీఆర్ పేర్కొన్నారు. తమ పార్టీ కుల, మత రాజకీయాలు, అసభ్య పదజాలం ఉపయోగించకుండా చాలా హుందాగా పోరాటం చేసిందని, ప్రజా సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లామని కేటీఆర్ పేర్కొన్నారు.

### ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పు అంశం

ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో రాబోయే ఉప ఎన్నికలపై కేటీఆర్ హెచ్చరించారు. "దొంగ ఓట్ల గురించి స్పష్టమైన ఆధారాలు ఇచ్చాం. పోలింగ్ రోజు మా అభ్యర్థి పట్టుకున్నారు. ఎన్నికల కమిషన్, పోలీసులు సమాధానం చెప్పాలి. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయమై బెంగాల్‌లో హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో కూడా పది చోట్ల ఉప ఎన్నికలు రావాల్సిందే. ఒక్క ఉప ఎన్నికకే కాంగ్రెస్ ఇన్ని ఆపసోపాలు పడింది. పది చోట్ల ఉప ఎన్నికలు జరిగితే సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలను తీసుకొస్తారేమో" అంటూ కాంగ్రెస్‌పై వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

## కార్యకర్తల కష్ట ఫలితమే నవీన్ యాదవ్ విజయం

**నిజాయితి, హైదరాబాద్ :**
జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపునకు కృషి చేసిన...కొల్లాపూర్ నియోజక నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు

ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదాం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కొల్లాపూర్ నాయకులు క్రమశిక్షణతో సమష్టిగా కృషి చేసి కాంగ్రెస్‌ని విజయతీరాలకు చేర్చారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ లో మొక్కవోని దీక్షతో పార్టీ విజయానికి పాటుపడ్డారని కొనియాడారు. కొల్లాపూర్ నాయకులు, కార్యకర్తల సహకారం మరువలేనిదన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం ఈ విజయాన్ని శాశ్వతం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పార్టీ కుటుంబంలాంటిదన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పకొట్టాలన్నారు. బీఆర్ఎస్ హాయంలో పదేళ్ల పాటు రాక్షస పాలన సాగిందన్నారు. అన్ని వ్యవస్థలను బీఆర్ఎస్ నాయకులు నిర్వీర్యం చేశారన్నారు. ముఖ్యంగా ఆర్థిక



విధ్వంసంతో రాష్ట్రం వెనుకబడి పోయిందన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు సంక్షేమాన్ని కొనసాగిస్తూనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇ చ్చిన హామీ మేరకు ఎన్ని ఆర్థిక అవరోధాలు ఉన్నా ఒక్కక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి విజయఢంకా మోగిద్దామన్నారు. అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

### నాగర్‌కర్నూల్ ప్రాంతంలోని కల్లు దుకాణాల్లో రహస్యంగా వాడుతున్న

## నిషిద్ధ అల్ప్రాజోలం పట్టివేత




**నిజాయితి, నాగర్‌కర్నూల్ :**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం మున్సిపల్ పరిధిలోని ఉయ్యాలవాడ శివారు ప్రాంతంలో గోల్డెన్ కేఫ్ దాబా వద్ద నిషిద్ధ అల్ప్రాజోలం అమ్మకం - కొనుగోలుపై పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎస్ఐ గోవర్ధన్ తన సిబ్బందితో కలిసి చేసిన ఈ రైడ్‌లో అల్ప్రాజోలం అమ్మకానికి ప్రయత్నించిన నలుగురు వ్యక్తులను, కొనుగోలుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు నాగర్‌కర్నూల్ డిఎస్‌పి బుర్రి శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు నిర్వహించిన ఒక ప్రత్యేక విలేకర్ల సమావేశంలో ఆయన వివరంగా మాట్లాడారు.

అరెస్టయిన నిందితులు బిజినపల్లి మండలానికి చెందిన వంగ ఆంజనేయులు గౌడ్, గార్లపాటి పురుషోత్తమ్ గౌడ్, తాడూరు మండలానికి చెందిన గులోలు సాయిరాం, నాగర్‌కర్నూల్ మండలానికి చెందిన మైల శివ శంకర్‌లుగా పోలీసులు గుర్తించటం జరిందన్నారు. కల్లులో మత్తు పెంచేందుకు ఈ అల్ప్రాజోలం ఉపయోగిస్తున్నట్లు తమ దర్యాప్తులో బయటపడిందని ఆయన తెలిపారు.

పోలీసుల దాడిచేసి అదుపులోకి తీసుకున్న నిందితుల వద్ద నుంచి మొత్తం 26.22 గ్రాముల నిషిద్ధ అల్ప్రాజోలం, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని. స్థానికంగా ఈ నిషిద్ధ పదార్థాన్ని రహస్యంగా విక్రయిస్తున్నట్లు తెలిపారు.

అదుపులోకి తీసుకున్న నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ గోవర్ధన్, పోలీసు సిబ్బంది భీముడు, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.